ఉత్సాహంగా క్రీడోత్సవాలు

అండర్19 విభాగం కబడ్డీలో తలపడుతున్న వెల్టూర్-నర్వ విద్యార్థినులు

కల్వకుర్తి, అక్టోబర్ 3 : కల్వకుర్తి పట్టణంలోని జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నాలుగురోజుల పాటు నిర్వహిస్తున్న ఉమ్మడి పాలమూరు జిల్లా బీసీ బాలికల క్రీడోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. క్రీడోత్సవాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన అండర్ 14, 19 విద్యార్థినులు పాల్గొన్నారు. జిల్లాలో 16 బీసీ గురుకుల బాలికల, 13 బీసీ బాలికల కళాశాలలకు చెందిన జట్లు ఈ క్రీడోత్సవాలకు హాజరయ్యాయి. క్రీడోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండోరోజు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ గురుకులాల ఆర్‌సీవో లింగయ్య, ప్రిన్సిపాల్ సరిత పర్యవేక్షించారు. దాదాపు 600 మంది విద్యార్థినులు క్రీడల్లో పాల్గొంటున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

అండర్19 విభాగంలో వాలీబాల్ ఆడుతున్న కల్వకుర్తి-పుల్లూర్ విద్యార్థినులు

క్రీడల్లో బీఆర్ఎస్ సర్కారు ప్రాధాన్యత

◆ ఎంపీపీ సామ మనోహర

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 3 : తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సముచిత స్థానాన్ని అందించి ప్రోత్సహిస్తోందని ఎంపీపీ సామ మనోహర అన్నారు. మంగళవారం మండలంలోని తాండ్రగ్రామంలో జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ 67వ ఖోఖో టోర్నమెంట్ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ సామ మనోహర, సర్పంచ్ సుశీల ముఖ్య అతిథులుగా హాజరై ఎంపికైన (అండర్14,17) బాలుర బాలికల జిల్లా జట్టుకు షీల్డ్‌లతో పాటుగా మెడల్స్, ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, సర్పంచులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లో తమ ప్రతిభను చాటాలన్నారు. గ్రామాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకుగానూ ప్రతి గ్రామంలో క్రీడామైదానాలు ఏర్పాటు చేసి వసతులు కల్పించిదన్నారు. క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి ఉన్నతంగా ఎదిగిన వారు చాలా మంది ఉన్నారని వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ గ్రామం పేరును జిల్లా, రాష్ట్రస్థాయిలో నిలపాలన్నారు. మంగళవారం ఎంపికైన క్రీడాకారులు బుధవారం వనపర్తి జిల్లా ఘన్‌పూర్‌లో నిర్వహించిన క్రీడల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకుడు పురంచంద్ తెలిపారు. తాండ్ర గ్రామంలో జిల్లాస్థాయి క్రీడలను నిర్వహించేందుకు సర్పంచ్ సుశీల ఈశ్వరయ్య, దాతలు సహకరించడం చాలా ప్రశంసనీయమన్నారు. అనంతరం ముఖ్య అతిథులను, క్రీడలను నిర్వహించిన పీడీలు, పీఈటీలను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, చెన్నకేశవులు, హెచ్ఎం జహంగీర్, ఎస్జీఎఫ్ కార్యదర్శి పాండు, ఎస్పీసీ కృష్ణ ప్రసాద్ గౌడ్, టీజీపీటీ సామ రమేశ్, మల్లయ్య, సత్యనారాయణ, పీడీలు మణి, స్వరూప, పీఈటీలు రాజేందర్, ప్రకాశ్, రమేశ్, మోహన్, బాలస్వామి, కిరణ్, ప్రమీల ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు షీల్డ్, మెడల్స్ అందిస్తున్న ఎంపీపీ

మొక్కల సంరక్షణకు శ్రద్ధ వహించాలి

తిమ్మాయిపల్లిలో పల్లెప్రగతి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో జయసుధ

చారకొండ, అక్టోబర్ 3 : మొక్కల సంరక్షణకు ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఎంపీడీవో జయసుధ అన్నారు. మంగళవారం మండలంలోని చారకొండ, తిమ్మాయిపల్లిలో పల్లెప్రగతి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు గణేశ్, కృష్ణ, ఫీల్డ్‌అసిస్టెంట్లు రాధ, వెంకటయ్య పాల్గొన్నారు.

అందుబాటులో కదిరి వేరుశనగ విత్తనాలు

వంగూరు, అక్టోబర్ 3 : యాసంగిలో వేరుశనగ పంటను సాగు చేసే రైతులు కదిరి-6 రకం విత్తనాలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం తిరుపతిలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి తనూజ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ట్రూత్‌ఫుల్లీ లేబుల్డ్ సీడ్ కేజీ రూ.120, బ్రీడర్‌సీడ్ రూ.170 చొప్పున విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

11 నుంచి సదరం క్యాంపులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 3 : ఈ నెల 11వ తేదీ నుంచి జిల్లాలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ నర్సింగ్‌రావు తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు, నూతన, రెన్యూవల్ సదరం సర్టిఫికెట్లు పొందేందుకు అక్టోబర్ 5న 10.30 గంటలకు మీసేవలో రూ.35 చెల్లించి స్లాట్‌బుక్ చేసుకోవాలని సూచించారు. శారీరక దివ్యాంగులకు ఈనెల 12, 17, 26, 31 తేదీల్లో ఉదయం పది గంటలకు జిల్లా కేంద్రంలో నిర్వహించే సదరం క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినికిడిలోపం, కంటిచూపులోపం ఉన్న దివ్యాంగులకు ఈ నెల 11న, మానసిక దివ్యాంగులకు ఈనెల 9, 16 తేదీల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంప్‌కు స్లాట్ బుకింగ్ తేదీ ప్రకారం హాజరుకావాలని సూచించారు.

గ్రామాలాభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం

సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ లక్ష్మణ్‌నాయక్

చారకొండ, అక్టోబర్ 3 : గ్రామాలాభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమని సిరుసనగండ్ల ఎంపీటీసీ లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ యాతం శారద శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అయోధ్యనగర్‌లో ఎస్డీఎఫ్ నిధులు నుంచి రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్లతో గ్రామాలు కళకళలాడుతున్నాయన్నారు. గ్రామాలాభివృద్ధికి నిధులు కేటాయించి రూపురేఖలు మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. విప్ గువ్వల బాలరాజు సహకారంతో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాంలాల్‌నాయక్, వెంకటయ్య, హరిలాల్‌నాయక్, దేవునాయక్, దీప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతోవ్య వసాయం చాలా శులభం

ఊర్కొండ, అక్టోబర్ 3 : డ్రోన్ల వల్ల వ్యవసాయం చాలా సులభమని కేవీకే విద్యార్థులు తెలిపారు. మండలంలోని మాదారంలో మంగళవారం నిర్వహించిన డ్రోన్లతో రైతులకు కలిగే లాభాలను వారు వివరించారు. చిన్నాతరహ రైతులు మధ్యతరహా రైతులకు డ్రోన్ల సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఖర్చు తగ్గించడమే కాకుండా సమయం ఆదా చేస్తుందన్నారు. సంప్రదాయ పద్ధతిలో పురుగుల మందు పిచికారీ చేయడం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. డ్రోన్ల వాడకంతో దీనిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంల్లో రావెప్ విద్యార్థినులు ఆశ్రిత,హారిక, హర్షిత,జ్యోతిక, మైత్రి పాల్గొన్నారు.

జాతీయస్థాయి గణితవిజ్ఞాన మేళాకు విద్యార్థులు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 3 : పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి గణితమేళాకు ఎంపికైనట్లు హెచ్ఎం మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు జిల్లా నూతక్కిలో దక్షిణాది మధ్యక్షేత్రస్థాయి గణిత విజ్ఞానమేళా విద్యార్థులు బాలవర్గలో అరవింద్, కిశోరవర్గలో శివమణి, మనస్విని, చరణ్‌లు ప్రథమస్థానం సాధించి జాతీయస్థాయి గణిత విజ్ఞాన మేళాకు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెలలో ఢిల్లీ, పంజాబ్‌లో పాల్గొంటారని హెచ్ఎం పేర్కొన్నారు.

గ్రామాలకు చేరుకున్న బతుకమ్మ చీరలు

బతుకమ్మ చీరలను తరలిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 3 : ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా ఆడపడుచులకు కానుకగా ఇచ్చే బతుకమ్మ చీరలు ఎంపీడీవో కార్యాలయం నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు చేరుకున్నాయి. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సీఎల్ఆర్సీ కార్యాలయం గ్రామాల వారిగా బతుకమ్మ చీరలను పంచాయతీ కార్యదర్శులు తమతమ గ్రామాలకు తరలించారు. మండలంలోని 24 పంచాయతీలకు మొత్తం 10,865 చీరలు వచ్చినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

నేడు బతుకమ్మ చీరలు పంపిణీ

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రాక

వెల్దండ, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడపడుచుల దసరా కానుకగా బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నేడు మండలంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, అదే విధంగా మండల ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. స్పోర్ట్స్‌కిట్స్ , బీసీ బంధు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

తుమ్మలపల్లిలో చురుకుగా అభివృద్ధి పనులు

తుమ్మలపల్లిలో సీసీ రోడ్డు పూర్తైన దృశ్యం

వంగూరు, అక్టోబర్ 3 : మండలంలోని తుమ్మలపల్లిలో రూ.50లక్షలతో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సహకారంతో ఎస్డీఎఫ్ నుంచి మంజూరైన రూ.30లక్షలతో రూ.25 లక్షలు వెచ్చించి గ్రామంలో సీసీ రోడ్ల పనులు చురుకుగా సాగుతున్నాయి. రూ.5 లక్షలతో యాదవుల కోసం పెద్దమ్మ ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం మరో రూ.20 లక్షలు మంజూరు చేసింది. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. గతంలో సీసీ రోడ్లు లేక గ్రామంలో వర్షం పడితే వీధులన్నీ చిత్తడిగా మారి నడవడానికి వీలులేకుండా ఉండేది. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. సీసీరోడ్డు నిర్మిస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏదీఏమైనా బీఆర్ఎస్ ప్రభుత్వంలో విప్ సహకారం, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, మదన్‌కుమార్‌రెడ్డిలు అభివృద్ధిలో ప్రధాన పాత్ర వహిస్తున్నారు.

ప్రారంభానికి ముస్తాబైన పీఏసీసీఎస్ సబ్‌సెంటర్

జాజాలలో పనులు పూర్తైన సింగిల్‌విండో సబ్ సెంటర్

వంగూరు, అక్టోబర్ 3 : మండలంలోని జాజాల గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సింగిల్‌విండో కార్యాలయం పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధమైనట్లు రంగాపూర్ సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రైతులకు సేవలందించే విధంగా జాజాలలో సింగిల్‌విండో మినీసబ్ సెంటర్ నిర్మాణానికి ఎంపీ రాములు తన నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేశారు. దీంతో సబ్‌సెంటర్ పనులు పూర్తి కావడంతో అన్నారం, జాజాల, పోతారెడ్డిపల్లితో పాటు పలు గిరిజన తండాల రైతులకు ఎంతో ఉపయోగపడుతోంది. రూ.10 లక్షలతో కార్యాలయంతో పాటు చుట్టూ ప్రహరీ గోడను నిర్మించారు. త్వరలో ప్రారంభించనున్నట్లు సురేందర్‌రెడ్డి తెలిపారు.